# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజల భాగస్వామ్యంతో అత్యవసర పరిస్థితి వంటి పెద్ద ప్రమాదాలను ఎదుర్కోవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో ఉద్ఘాటించారు.**

2. **పల్నాడు జిల్లాలోని నాగార్జున కొండ ప్రాంతానికి, బౌద్ధ మతానికీ బలమైన బంధం ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

3. **“మహిళల నేతృత్వంలో అభివృద్ధి” అంశం భారతదేశ భవిష్యత్తుకి చోదక అంశంగా మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

4. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగు దేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఈ రోజు జరుగుతోంది.**

5. **జల జీవన్ మిషన్ పథకం ద్వారా త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.**

=========================

యోగాను తమ రోజు వారీ జీవితాలలో భాగం చేసుకునే వారి సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 123వ సంచికలో తన మనసులోని భావాలను ఈ రోజు ఆయన ప్రజలతో పంచుకున్నారు. “ఒక భూమి, ఒక ఆరోగ్యం కోసం యోగా“ అనేది ఒక నినాదం మాత్రమే కాదని ఇది ఒక మార్గమని, ఇది వసుధైవ కుటుంబం అనే భావనను గుర్తు చేస్తుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున విశాఖపట్నం సముద్రతీరంలో మూడు లక్షల మంది ప్రజలు ఒకేసారి యోగా చేశారని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..32 సెకన్లు

--------------------------

తీర్థయాత్రలు క్రమశిక్షణను, పరస్పర ప్రేమని, సోదర భావాన్ని నేర్పిస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 123వ సంచికలో తీర్థయాత్రలపై ఆయన ప్రసంగిస్తూ, చాలా కాలం తర్వాత కైలాస ,మానస సరోవరం యాత్రలు మళ్ళీ ప్రారంభమయ్యాయని చెప్పారు. జూలై మూడవ తేది నుండీ పవిత్రమైన అమర్నాథ్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఉత్తరం నుండి దక్షిణం వరకూ , తూర్పు నుంచీ పడమర వరకూ చేసే ఈ యాత్రలు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ భావానికి ప్రతిబింబాలని

తెలిపారు. ధార్మిక యాత్రలు సేవా కార్యక్రమాలను చేసుకునేందుకు గొప్ప అవకాశాలను కల్పిస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రజల భాగస్వామ్యంతో అత్యవసర పరిస్థితి వంటి పెద్ద ప్రమాదాలను ఎదుర్కోవచ్చని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ 123 వ సంచికలో సంవిధాన్ హత్యా దివస్ "రాజ్యాంగ హత్యా దినం" పై ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ,ప్రజాస్వామంపై భారతీయ ప్రజల సామర్థ్యం ఎంతో ధృఢమైనదని తెలిపారు. అత్యవసర పరిస్థితి సమయంలో భారతదేశంలో ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చెయ్యడానికి మాజీ ప్రధాన మంత్రి చేసిన ప్రసంగాన్ని ప్రధానమంత్రి వినిపించారు.

వాయిస్ ..34 సెకన్లు

---------------------------

"మహిళల నేతృత్వంలో అభివృద్ధి" అంశం భారతదేశ భవిష్యత్తుకి చోదక అంశంగా మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమంలో తెలంగాణాలోని భద్రాచలానికి చెందిన మహిళలగురించి ప్రస్తావించారు. భద్రాద్రీ మిల్లెట్ మ్యాజిక్ పేరుతో చిరుధాన్యాలతో బిస్కెట్లు తయారుచేస్తున్నారని ఈ బిస్కెట్లు హైదరాబాద్ నుంచి లండన్ వరకు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు.ఈ మహిళలు స్వయం సహాయక సంఘాలతో అనుసంధానమై శిక్షణను పొందారని తెలిపారు. కొనుగోలుదారులు భారతదేశంలో తయారైన వస్తువులనే కొనుగోలు చేయడం ద్వారా ఆత్మనిర్భర భారత ఉద్యమానికి కొత్త శక్తి లభిస్తుందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాలోని నాగార్జున కొండ ప్రాంతానికి, బౌద్ధ మతానికీ గాఢమైన సంబంధం ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమంలో బుద్ధభగవానుని పవిత్ర అవశేషాల ప్రదర్శనపై ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, నాగార్జున కొండను శ్రీలంక, చైనా దేశాలతో పాటూ దూరప్రాంతాల నుండీ ప్రజలు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారని చెప్పారు. బుద్ధభగవానుని పవిత్ర అవశేషాలను భారతదేశం నుంచి వియత్నాం తీసుకు వెళ్ళారని భారత్ చేసిన ఈ ప్రయత్నం వియత్నాంలో ఒక జాతీయ ఉత్సవంగా మారిందని తెలుపుతూ..

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఈ రోజు జరుగుతోంది. ఈ సమావేశంలో టిడిపికి చెందిన రాష్ట్ర మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వచ్చే నెల రెండవ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటింటి ప్రచారంపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేస్తున్నారు. అనంతరం పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై సంక్షేమ పథకాల అమలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు, మూడు పార్టీల సమన్వయంపై చర్చించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ తెలిపారు. ఢిల్లీలో ఒక మీడియా ఛానెల్ నిర్వహించిన వైద్యుల సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధిలో ఆరోగ్య సంరక్షణ చాలా కీలకమని అన్నారు. వికసిత్ భారత్ 2047 కు అనుగుణంగా స్వర్ణ ఆంధ్ర 2047కు సంబంధించి ఆరోగ్య సంరక్షణపై స్పష్టమైన లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు. వచ్చే 3 సంవత్సరాల్లో పబ్లిక్ –ప్రైవేట్– భాగస్వామ్యం –పీపీపీ విధానంలో మరిన్ని ఆరోగ్య సంస్థలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

జల జీవన్ మిషన్ పథకం ద్వారా త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా శిరగార పల్లిలో 75 లక్షల రూపాయలతో చేపట్టనున్న జల జీవన్ మిషన్ పథకం పనులకు నిన్న శంకుస్థాపన చేశారు. రైతులకు పంట సాగునీరు అందించేలా పోలవరం ప్రాజెక్టు ను పూర్తి చేయనున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 21 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్.. 27 సెకన్లు

======================